నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 25న (నేడు) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి అమర్లపురి వందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లోని 200 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఉదయం 11 గంటలకు విజయనగర్ కాలనీలోని హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 83284 289 33 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లఘు చిత్రాలకు ఆదరణ

గన్‌ఫౌండ్రీ: షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి తెలుగు షార్ట్‌ఫిల్మ్- 2025 పోటీల్లో టెన టైమ్స్ లఘు చిత్రానికి 4 అవార్డులు లభించాయి. ఈ మేరకు బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ లఘు చిత్రాల నటీ నటులు, సాంకేతిక బృందానికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు వీఎన్.ఆదిత్య మాట్లాడుతూ.. నగరానికి చెందిన రామడుగు వసంత్ దర్శకత్వం వహించిన టెన్‌టైమ్స్ చిత్రానికి అవార్డులు రావడం అభినందనీయమని రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు తీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ సభ్యులు బీకే ఎస్ ప్రసాద్, డివి.రాజు, దర్శకుడు మల్లం రమేశ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

పొదుపు సంఘానికి రూ.15లక్షల రుణం



పొదుపు సంఘం సభ్యులకు చెక్కు అందజేస్తున్న గౌతంరావు, కార్పొరేటర్

నల్లకుంట: నల్లకుంటకు చెందిన మహిళా పొదుపు సంఘానికి బ్యాంకు రూ.15లక్షల రుణాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం నల్లకుంటలో జరిగిన సమావేశానికి హాజరైన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ వై.అమృతతో కలిసి బ్యాంక్ రుణానికి సంబంధించిన చెక్కును పొదుపు సంఘం సభ్యులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎం.మురళీయాదవ్, పొదుపు సంఘం సభ్యులు పద్మలత, గాయత్రి, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఆర్ పాటకు పట్టాభిషేకం



సినీనటి ప్రసన్నరాణికి వంశీ-ఏఎన్‌ఆర్ నటన పురస్కారం ప్రదానం చేస్తున్న దైవజ్ఞశర్మ

చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) ఆధ్వర్యంలో నీలాలా గగనాన నిండిన వెన్నెల... ఏఎన్‌ఆర్ పాటకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. బుధవారం రాత్రి త్యాగరాయ గాన సభలో జరిగిన విభావరిలో గాయనీగాయకులు పాల్గొని ఏఎన్‌ఆర్ నటించిన చిత్రాల్లోని గీతాలను శ్రవణానందంగా ఆలపించి అలరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సినీ నటి ఆర్.ప్రసన్నరాణికి వంశీ–ఏఎన్‌ఆర్ నటనా పురస్కారాన్ని దైవజ్ఞశర్మ ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, వీఆర్‌కే ఫణిఏ, రవీందర్, లలితారావు, రవికుమార్, జేఏ శాస్త్రి, ఆర్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు అండగా ఆరెకటిక సంఘం



పింఛన్ల పంపిణీలో సంఘం ప్రతినిధులు

కాచిగూడ: బాధ అనుభవించే వారికే తెలుస్తుందని... సాయం విలువ అది చేసే వారికే తెలుస్తుందని ఆరెకటిక సంఘం అధ్యక్షుడు హెచ్.రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం జమాల్‌బస్తీలోని ఆరెకటిక భవన్‌లో వితంతువులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు వితంతువులకు పింఛన్లు అందజేశారు. త్వరలో మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఆరెకటికలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హీరేకార్ సాయి, సచ్చిదానంద్, జ్ఞానేశ్వర్, రాజు, హరి, శేఖర్, ఆనంద్, సంజయ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ నమోస్తుతే.!




అన్నపూర్ణదేవి అలంకరణలో అంబర్‌పేట మహంకాళి, చిక్కడపల్లి వివేక్‌నగర్ భువనేశ్వరిదేవి



కౌమారి అలంకరణలో శంకరమఠం శారదాదేవి



గాయత్రీదేవి అలంకరణలో కనకాల కట్టమైసమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో కనులపండువగా జరుగుతున్నాయి. బుధవారం (మూడో రోజు) అమ్మవార్లను అన్నపూర్ణదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి హనుమాన్‌దాస్ వివేక్‌నగర్ భువనేశ్వరిదేవికి 10తులాల బంగారు కిరీటం తయారు చేయించి వేదపండితులకు అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్‌దాస్‌ను ఆలయ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ దేవనాథం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



గోల్నాక జైస్వాల్‌గార్డెన్‌లో అమ్మవారి ఆలయంలో నిర్వహించిన హోమ పూజలో భక్తులు



బంగారు కిరీటం చేయించిన హనుమాన్‌దాస్‌కు సన్మానం



లక్ష్మీగణపతి దేవాలయంలో జరిగిన పూజలో భక్తులు



అంబర్‌పేట అమ్మవారి ఆలయం వద్ద అన్నాదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు



అడ్వకేట్స్‌కాలనీలో అన్నదానం చేస్తున్న బండారు దత్తాత్రేయ

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



డీడీఆర్ మిల్ హెల్త్ సెంటర్‌లో హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. బుధవారం కవాడిగూడ లోయర్ ట్యాంక్ బండ్‌లోని డిబిఆర్‌మిల్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ్ నారీ స్వశక్తు పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి మెగా హెల్త్ క్యాంపులను ఉపయోగించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వల్లాల శ్యామ్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని... జాబ్ కేలండర్ ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, సమాచార శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో బీసీ సంఘం ప్రతినిధులతో కలిసి ఆర్.కృష్ణయ్య చర్చలు జరిపారు. అనంతరం సమస్యలపై ఆయన మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... నిరుద్యోగ నేత అశోక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష 9 రోజులకు చేరుకుందన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి చాలా క్షీణించిందని తెలిపారు. అశోక్‌తో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలని ఆయన మంత్రిని కోరారు. ప్రభుత్వం వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి చర్చలు జరిపి వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, చెరుకు మణికంఠ, రవికుమార్ యాదవ్, అనంతయ్య, రాజునేత, లింగం యాదవ్, రాజు గౌడ్, మహేందర్, శివ, నరేష్, కులదీప్ సింగ్, లక్ష్మణ్, లక్ష్మీకాంత్, వీరేష్, సునీల్, మనోజ్, ఓయూ విద్యార్థి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన.. గర్భిణులకు సీమంతం



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న కార్పొరేటర్

కవాడిగూడ: బాల్యం బాగుంటేనే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ సూచించారు. బుధవారం డివిజన్‌లోని సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లల పోషణ ఆరోగ్యం మెరుగుపర్చడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు. సరైన పోషకాలు అందక చిన్నారుల్లో ఎదుగుదల లోపిస్తోందని అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. తల్లీబిడ్డలకు మంచి ఆహారంతో పాటు పోషక ఆహారంపై అవగాహన కల్పించేందుకు పోషణ మాసోత్సవం ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాల, టీచర్లు ధనమ్మ, సంతోషిణి, కవిత, బీజేపీ నాయకులు జి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి కోశాధికారి, శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దివంగత మంత్రి సునిల్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునిల్ చిత్రపటానికి ట్రస్ట్ ప్రతినిధులు నివాళులర్పించారు. దివంగత మంత్రి సునిల్ మాతృమూర్తి మంత్రి లీలాబాయిని శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు అక్కినేపల్లి పురుషోత్తంరావుతో పాటు పలువురికి ట్రస్టు తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



చెక్కును అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

ముఖ్యమంత్రి రాక.. ఏర్పాట్లపై ఆరా



బతుకమ్మకుంట ప్రారంభోత్సవం నేపథ్యంలో బుధవారం రాత్రి నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 26న సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ కుంటను ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీరితో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

– అంబర్‌పేట

వైద్యురాలిని బురిడి కొట్టించిన సైబర్ కేటుగాళ్లు

నల్లకుంట: సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కిన ఓ ఆయుర్వేద వైద్యురాలు రూ.45వేలు పోగొట్టుకున్న ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నల్లకుంట ఎస్‌హెచ్‌వో మారుతీప్రసాద్ తెలిపిన వివరాలు.. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు రమ్యశ్రీ వేముల(27) నల్లకుంట ప్రశాంత్‌నగర్ శివం అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. ఈనెల 22న తన స్నేహితురాలి వాట్సాప్ నంబర్ నుంచి రమ్యశ్రీకి ఓ మెస్సేజ్ కాల్ వచ్చింది. తనకు అత్యవసరంగా రూ.90వేలు అవసరం ఉందని వెంటనే పంపించమని అవతలి వ్యక్తి ప్రాధేయపడింది. తన యూపీఐ పనిచేయడంలేదని తాను ఒక నంబర్ ఇస్తాను ఆ నంబర్‌కు ఫోన్ పే చేయమని చెప్పింది. తన స్నేహితురాలే అని నమ్మిన రమ్యశ్రీ వెంటనే ఆ నంబర్‌కు రూ.45వేలు ఫోన్‌పేలో పంపించింది. ఆ తర్వాత మిగిలిన రూ.45వేలు కూడా పంపించాలని కోరింది. దీంతో అనుమానం వచ్చిన రమ్యశ్రీ తన స్నేహితురాలి వాట్సాప్ స్టేటస్ చెక్ చేయగా వాట్సాప్ హైక్ చేశారని ఉంది. వెంటనే తాను ఫోన్‌పే చేసిన ఆ నంబర్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయని గ్రహించిన ఆమె వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం బుధవారం నల్లకుంట పోలీసులకు అప్పగించారు.

వృద్ధురాలి అదృశ్యం



టి.జయశ్రీ (ఫైల్)

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధురాలు తప్పిపోయిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన టి.శంకర్ భార్య టి.జయశ్రీ (70) గుడికి వెళ్లి తిరిగి రాలేదు. ఇంటి పరిసరాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధురాలి కూతురు లత పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ గ్రౌండ్‌కు వీహెచ్ పేరు పెట్టాలి

అంబర్‌పేట: అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ ఏర్పాటుకు ఎంతో కృసి చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతారావు పేరు పెట్టాలని అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. 1979లో పోలీసు విభాగంతో పోరాటం చేసి 10 ఎకరాలు సేకరించి గ్రౌండ్ ఏర్పాటు చేశారన్నారు. వీహెచ్ ఆనాటి కృషి వల్ల ఈ గ్రౌండ్‌లో ఎంతో మంది క్రీడాకారులు శిక్షణ పొంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సహకారంతో వీహెచ్ చేసిన కృషితో ఏర్పాటైన గ్రౌండ్‌కు వీహెచ్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌గా ప్రభుత్వం అధికారికంగా పేరును ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈనెల 26న వినతి పత్రం అందించనున్నట్లు వారు వెల్లడించారు. వీహెచ్ కోసం శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్‌పూల్, బతుకమ్మకుంట పునరుద్ధరణ వంటి అభివృద్ధి పనులను చేసి అంబర్‌పేట ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా గ్రౌండ్‌కు వీహెచ్ పేరు పెట్టాలన్నారు. ఈ సమావేశంలో గ్రౌండ్ అసోసియేషన్ ప్రతినిధులు సద్గురు, ధనుంజయ, వై.శంకర్‌గౌడ్, యాదగిరి, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ అసోసియేషన్ అధ్యక్షులు పి.జ్ఞానేశ్వర్‌గౌడ్

బతుకమ్మకుంటకు వీహెచ్ పేరు పెట్టాలి: కట్టెల సుభాష్

నల్లకుంట: దశాబ్దాల పోరాటంతో బతుకమ్మకుంటను కబ్జాకు గురి కాకుండా కాపాడిన మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్)కు టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. బతుకమ్మ కుంట పరిరక్షణ కోసం చాలా ఏళ్ల పాటు పోరాటం చేసినందుకు గుర్తుగా ఆ కుంటకు వీహెచ్ బతుకమ్మకుంటగా పేరు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే బతుకమ్మకుంట పునరుద్ధరణ, సుందరీకరణలో తమవంతు సహకారం అందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈనెల 26న బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గం నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

'బతుకమ్మకుంటపై కాంగ్రెస్ బురద రాజకీయాలు చేస్తోంది'

బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి



అంబర్‌పేట: బతుకమ్మకుంట అభివృద్ధిపై హైడ్రా, మాజీ ఎంపీ వి.హనుమంతారావు కోర్టును తప్పుదారిని పట్టించడంతో పాటు వారి ఆదేశాలను కూడా పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఛే-నంబర్‌లోని ఆయన నివాసంలో మాట్లాడుతూ... బతుకమ్మకుంట ప్రైవేట్ స్థలమని చెప్పారు. తమకు దానిపై అన్ని హక్కులు ఉన్నప్పటికీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ బతుకమ్మకుంటను అభివృద్ధి చేసిందన్నారు. కోర్టు ఆదేశాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ కనీసం పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమని అన్నారు. అలాగే బతుకమ్మకుంట 30 ఏళ్ల క్రితమే తాను అగ్రిమెంట్ చేసుకున్నానని తెలిపారు. అప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం బీఆర్‌ఎస్ పార్టీపై బురద చల్లడం వారి చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. బతుకమ్మకుంట అంశానికి బీఆర్‌ఎస్ పార్టీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆలస్యమైనా న్యాయం గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా పోరాడదాం

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో 153వ సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా విద్యానగర్ మార్క్స్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కార్యదర్శి జి.ఝాన్సీ మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే 1873 సెప్టెంబర్ 24న సత్య శోధక్ సమాజ్ స్థాపించారన్నారు. ఈ దేశంలో మనువాద దురాచారాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా.. కుల నిర్మూలన లక్ష్యంగా సమాజ్‌ను స్థాపించారని తెలిపారు. తాను చదువుకోవడమే కాకుండా తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు చెప్పించారన్నారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు విద్య అందించడం కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. ముఖ్యంగా స్త్రీలకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించి చదువు చెప్పించారని గుర్తుచేశారు.

- దాని కోసం ఆనాటి సమాజంలో బ్రాహ్మణులు చేసిన అనేక దాడులను ఎదుర్కొన్నారని తెలిపారు. మూఢనమ్మకాలు సతీసహ గమనానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచారని పేర్కొన్నారు. బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో జిల్లా నాయకులు శివబాబు, మహేందర్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేష్, రాశ ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, యాదన్న, సత్యనారాయణ, మంద నవీన్, కె.శ్రీనివాస్, ఎస్‌కే ఆసిఫ్, గడ్డం గౌతం, తీగల శ్యామ్, జిల్లా నాయకులు యశ్వంత్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఝాన్సీ

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగా అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో కనుల పండువగా జరుగుతున్నాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. నల్లకుంట నర్మదా భవన్‌లోని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యాలయంలో బుధవారం సాయంత్రం 'నాన బియ్యం.. బతుకమ్మ సంబరాలు'పేరుతో నిర్వహించారు. 'ఆడపడుచుల బతుకమ్మ – మన తెలంగాణ బతుకమ్మ'పేరుతో చిక్కడపల్లి వాసవీ మహిళ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు సందడిగా జరిగాయి. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు రెండు నియోజకవర్గాలను బీఆర్‌ఎస్ మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న కార్పొరేటర్ అమృత, బిక్కుమల్ల నిర్మల



బీఆర్‌ఎస్ నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు తరలివెళ్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



లక్ష్మీగణపతి దేవాలయంలో బతుకమ్మ వేడుకలలో వాసవీ మహిళా మండలి సభ్యులు

సందడిగా 'అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం'



చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వరరావు ప్రపంచమంతా గుర్తుపెట్టుకునేంత ఖ్యాతిని గడించారని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ. రమణాచారి అన్నారు. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు జయంతి బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం'కార్యక్రమాన్ని నిర్వహించారు. రేలంగి నరసింహారావు, జుర్రు చెన్నయ్య, పొత్తూరి సుబ్బారావు, బొప్పన నరసింహారావు, రామరాజు, లక్ష్మీశ్రీనివాస్, కామేశ్వరరావు, రాంబాబుకు అక్కినేని పురస్కారం ప్రదానం చేసి ఆయన సత్కరించారు. లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రామరాజు శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ, వెంకట్రావు, లోకం కృష్ణయ్య, వీర రాఘవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.